# ఎన్నోరంగుల తెల్లకిరణం
## – సిరివెన్నెల సీతారామశాస్త్రి



*(సిరివెన్నెలగారు వ్రాసిన కథలు నెలకొకటి)*

**సంకల్పం**

సాహిత్యంలో 'కథ' (short story)కి సంబంధించిన నిర్వచనాలూ, నియమావళి, ఆవిర్భావం. ఆకృతి, పరిణామము, పరిణితి ఇత్యాది అంశాలపట్ల నాకు నిర్దిష్టమైన అవగాహన ఉంది - అని నేను అనుకోను. కథా సామ్రాజ్య నిర్మాతల, నిర్ణేతల సరసన నిలచి తర్కించే తాహతు నాకుందని కూడా అనుకోలేను.

'ఏం చెప్పాలి' అనే దానికన్నా 'ఎలా చెప్పాలి?' అనే అంశంపట్లే నాకు ఎక్కువ మక్కువ.

కనుక, నా కథల్లో ఇంతవరకు స్పృశించబడని, కనని, వినని అపురూపమైన 'వస్తువు' ఉందని దబాయించను.

కథా కథన విధానంలో, రసపోషణ, నిర్వహణ వగైరా సాంకేతికాంశాలపట్ల నాకున్న పరిజ్ఞానం బహు తక్కువ.

'కథ చెప్పడం' అనేది ఎప్పుడో అయిపోయింది – "with all its totality & perfection" అనేది నా నమ్మకం.

'ఎలా చెప్పడం' అనేది ఎప్పటికీ అయిపోదు అనేది కూడా నా నమ్మకం.

'అతి పాత', 'మామూలు' విషయాలే ఒక్కొక్కప్పుడు నా గుండెను కొత్తగా, బలంగా 'తాకిన' అనుభూతి కలిగినప్పుడు, ఆ అనుభూతిని యథాతథంగా 'మాటల్లో'కి అనువదించడానికి నేను చేసిన ప్రయత్నాన్ని చాలామంది కథా సాంకేతిక నిపుణులు 'ఇది, ఇలాంటిది కథే కాదు పొమ్మన్నారు.'

'కాబోసు' అనుకున్నాను గాని, తెగబడి 'ఏం? ఎందుక్కాదు?' అని ఎదురు తిరిగే ప్రయత్నం చెయ్యలేదు. 'కానీలే! నాదో 'మాలోకం' అయి ఉంటుందని ఊరుకున్నాను.

నా 'మాలోకం'లో జనాభా లెక్కల సేకరణ జరిగితే, నేను గాక ఇంకా ఎవరైనా ఉన్నారా, ఉంటారా అని తెలుసుకోవాలనే నా ఆరాటం గత ముప్పై సంవత్సరాలుగా నన్ను వెన్నంటే ఉంది.

ఆ 'రీసెర్చి'లో భాగంగా ఇలా నా 'స్వగతాలన్నీ' ఓ సంకలనంగా పోగుచేసి అన్వేషణకి పంపిస్తున్నాను.

*(సీతారామశాస్త్రి)*

## పోస్ట్‌మార్టం

**ఒక ఫోటో అది**. ఫొటోగ్రాఫర్ చాలా గొప్ప స్కిల్డ్ ఆర్టిస్ట్ అయివుండాలి. ఏరియల్ వ్యూలో తీశాడు.

పొడుగ్గా, సరళ రేఖలా వుంది కాలువ. కాలువకి అవతల గట్టుకి అవతల వైపుగా రైలు పట్టాలు, వాటికి వెనుక పొలాలు. ఇవతలి గట్టుమీద అర్ధవృత్తం మనుష్యులు. మనుషుల తలలు.

బట్టతలలు.. బుట్టతలలు.. పాగాలు.. టోపీలు.. గుళ్ళు.. 'గోపురాలు'.. 'పిచ్చుకగూళ్ళు' తలలు.

ఆడ, మగ, పిల్లా 'పీచూ,' ముసలీ, 'ముతకా' బార్బేరియస్.. అన్‌సివిలైజ్డ్.. సోఫిస్టికేటెడ్. ఇల్యూంబ్డ్.. తలలు వెంకన్న బాబువి కొన్ని, వెస్టన్ బాబులవింకొన్నీ తలలు!! తలలే మనుషులవే!!

ఏరియల్ వ్యూలో శరీరాలు కనబడవు. ఆ తలలకి అదుగున కళ్ళమధ్య, వుండొచ్చు - మనుషులు కాని - కొన్ని కుక్కలూ, వాటి పిల్లలూ మరేవైనా కూడా! అయితే అవేవీ ఏరియల్ వ్యూలో కనిపించవు.

ఆ అర్ధవృత్తంలోని ప్రతి బిందువూ, తల! తల!! తల. ఒకటి, రెండు మూడు.. పది బోల్టు మనుష్యులవే తలలు.

ఆ కాలువ సరళరేఖ, ఆ అర్ధవృత్తానికి వ్యాసం రెండు గట్లనీ కలుపుతూ, కాలువకి లంబంగా లాకు.

ఆ చాలా గొప్ప స్కిల్ ఫోటో గ్రాఫర్ ఆ ఏరియల్ వ్యూ ఎలా తీశాడూ? ఏమో? అలా ఎందుకు తీశాడూ?!

సరిగ్గా కాలువ మధ్య, ఆ సరళరేఖకి ఖచ్చితంగా నూట యెనభై డిగ్రీల కోణంలో హారిజాంటల్‌గా హారిబుల్ హారిబుల్! ఓ గాడ్ హారిబుల్!!

ఓ తల నల్లని కాలువ నీళ్ళ మీద మరీ నల్లగా పరుచుకున్న పొడవైన జుట్టు నాచులా. బొత్తిగా తెల్లగా వీపూ, పిరుదులూ.. ఆచ్ఛాదన లేదు.

ఆ తలలన్నీ బోర్లా తిరిగి వున్న ఆ శరీరాన్ని చూసేందుకేనా? వెల్లకిలా లేదేం? ఏరియల్ వ్యూలో చూసేశాక, ఆ చూపు 'స్థిర' పడిపోయాక, వెల్లకిలా తిరిగే వుంటుంది. తిప్పే ఉంటారు.

ఫోటో మాత్రం గొప్పగా స్పష్టంగా.

బల్లమీద వుంది ఆ ఫోటో - మధ్యగా. బల్లకి అటూ ఇటూ రెండు కుర్చీలు. ఆ కుర్చీల్లోంచి, రెండు జతల కళ్ళు, గత పదిహేనిరవై నిమిషాలుగా ఆ బల్లమధ్యకి, ఆ ఫోటో మీదకి వాలి, తీక్షణంగా చూస్తున్నాయి. చూస్తూ, తమతో తాము, తమ భాషలో, తమలోకి తాము మాట్లాడుకుంటున్నాయి.

"ఎవరు తీసారిది?" టేబుల్‌కి ఇవతలి ప్రక్క కుర్చీలో కూర్చున్న చాకులాంటి యువకుడు చెప్పాడు.

"గొప్ప మూవింగ్‌గా తీశాడు" కళ్ళల్లోనూ, కంఠంలోనూ తీవ్రమైన భావసంచలనాన్ని సూచిస్తూ అన్నాడు 'మనిషి' - ఆ పెద్దాయన. 'మనిషి' ఆయన పేరు.. కలం పేరు.

"ఎక్సైట్ కాకండి. బి.పి పెరుగుతుంది" అన్నాడు ఆ చాకులాంటి యువకుడు 'పాళీ' - కలం పేరే.

ఆ గది ఒక పత్రికాఫీసు, పత్రిక 'మానవత్వం'. డైలీ!! ఎడిటర్ 'మనిషి'. చీఫ్ రిపోర్టర్ 'పాళీ'.

"ఊఁ! ....ఏమయ్యింది?"

"బలైపోయింది"

"ఆ అమ్మాయి పేరేవిటీ?"

"ఏమో?"

ఎందుకు కనుక్కోలేదూ?"

"అవసరమా?"

"ఊఁ?.. ఊఁ...! ఎవరికి బలైపోయింది?"

"ఈ లెక్కకి సగటు జవాబు మాత్రమే చెప్పగలను"

"చెప్పు"

"కాలం"

"వేటి వేటికి సగటు విలువ ఈ కాలం?"

"చాలా విలువలు. సమాజం, పరిస్థితులు, కోరికలు, బలహీన క్షణాలు, అవకాశ వాదం, మనిషిలోని పశుత్వం, ఆవేశం, ముందుకి సాగిన ఎన్నో చూపుడు వేళ్ళు, ముడుచుకుపోయిన ఆనిన చిటికిన వేళ్ళు.. ఇలా ఎన్నో సంఖ్యల సగటు ఫలితం అది."

"ఊఁ... మైగాడ్. మైగాడ్ ఇప్పుడేమౌతుంది?"

"ఈ పాటికి రాత, కోత పూర్తైపోయి, ఇంత బూడిద, కొన్ని గుండెల్లో ఎర్రని గాయం.. మరికొన్ని బతుకుల మీద నల్లని మచ్చ. ఒకటి, రెండు కనుకొలకుల్లో సానుభూతి యొక్క ఒకటీ, పశ్చాత్తాపపు చుక్క అరా.. అఫ్‌కోర్స్. రాలిపోయి వుంటాయీపాటికి"

"డామిట్ వీల్లేదు.. వీల్లేదలాగా.. వీల్లేదే. అబ్బె బ్బె బ్బె బ్బే. వీల్లేదు. వీల్లేదు"

"....."

"ఇది హత్యా? ఆత్మహత్యా?"

ఆత్మ యొక్క హత్య."

"కాదు.. అది కాదు. కాకూడదు. వెళ్ళు వెళ్ళు. తక్షణం వెళ్ళి పరిశోధించు. రిపోర్ట్ తీసుకురా. తీసుకురా (ఐ వాంట్ ఎ డీటెయిల్డ్ రిపోర్ట్ ఎబౌట్ ది రెస్పాన్స్‌బిలిటీ ఆఫ్ దిస్ రిజల్ట్. ట్రూత్. ఫేక్ట్స్..) సత్యం కావాలి నాకు. నిజం ఖచ్చితంగా తెలుసుకుని రా! రెండు మూడిష్యూలు 'మానవత్వం' హెడ్‌లైన్స్‌లో ఈ రిపోర్టే వుండాలి."

"అవును. రెండు మూడిష్యూలు. అవునవును. మన 'డైలీ'లో రెండు మూడిష్యూలు. అవునవును. మన 'మానవత్వం డైలీ హెడ్' లైన్స్‌లో రెండు మూడిష్యూలు?

"??????"

"వెళ్ళనా?"

"ఊఁ?.. ఆఁ?... ఆఁ?... అయినా సరే వెళ్ళు. వెళ్ళు వెళ్ళు వెళ్ళు.

"నమస్తే అండీ!"

"నమస్తే రండి"

"నేను మానవత్వం చీఫ్ రిపోర్టర్ పాళీని."

"అలాగా!..?"

"మీ అమ్మాయి. ప్లీజ్ ఏడవకండి. నేనర్థం చేసుకోగలను. కానీ, నాకర్థం కావలసింది మరొకటుంది. దానికి మీ సహాయం కావాలి"

"క్షమించండి. ఇప్పుడు నేనేం చెప్పలేను. కన్నకూతురు పోయినందుకు ఏడవాలో, తలకాయ ఎక్కడ పెట్టుకోవాలో తెలియక ఏడవాలో, ఆ దౌర్భాగ్యుణ్ణి నిలువునా నరికి చంపలేని చేతగానితనానికి ఏడవాలో అయాం సారీ! నేనేం చెప్పలేను. ప్లీజ్ నన్నొంటరిగా వదిలెయ్యండి"

"అర్ధం చేసుకోగలను, నేను అర్ధం చేసుకోగలను. ఇలావచ్చి ప్రశ్నించడం కూడా బాధగానే వుంది నాకు. కానీ, సర్ చూడండి. నేను మిమ్మల్ని వేధించడానికీ, మీ ఒంటరితనాన్ని భంగపరచడానికి కూడా రాలేదు. పైగా మీతో అవసరం కూడా లేదు నాకు. మీరు చెయ్యవలసిన సహాయం వేరే వుంది. మానవత్వానికి చాలా ఉపయోగిస్తుందది. కాదనకండి దయచేసి ప్లీజ్"

"ఏం చెయ్యమంటారు చెప్పండి?"

"మీలోని మిమ్మల్ని, కాస్సేపు నాకొదిలేసి ఇంటర్వ్యూ చేసుకోనివ్వండి. ఐ మీన్.. మీ అంతరంగాన్ని కాస్సేపు నా దగ్గరొదిలేసి, మీరు లోపలికి వెళ్ళిపోవచ్చు. జస్ట్ ఫర్ టెన్ మినిట్స్. మళ్ళీ పంపించేస్తాను."

"సరే కానివ్వండి. ఆ పది నిమిషాలైనా ప్రశాంతంగా వుండుగలుగుతానేమో!"

"ఊఁ చెప్పండి."

"ఊఁ మీ పేరు పాళీగారా? ఏం చెప్పమంటారు చెప్పండి. రిటైరైపోయాను. ఇద్దరాడపిల్లల పెళ్ళిళ్ళు చేసి టైరైపోయాను. పూర్తిగా అలిసిపోయాను. అరిగిపోయాను. చెప్పులతోబాటు, కాళ్ళూ, కీళ్ళూ కూడా అరిగిపోయాయి. అలిసి పోయాను. అప్పులపాలైపోయాను. ఉక్కిరిబిక్కిరైపోయాను.

అందివస్తాడనుకున్న పిల్లవాడు, నేను ఖర్చుపెట్టిందంతా తిని, ఆకలి తీరక, తన జీవితాన్ని తనే తినేసుకుని పోయాడు. వెళ్ళిపోయాడు. చచ్చిపోయాడు.

పెట్లో వుంది వాడి ఎమ్మే. ఎంత సంపాదించి వుండేదో. ఇప్పుడు దాని విలువ ఒక గత జీవితపు పాతికేళ్ళు, ప్లస్ కొన్నివేలు, ప్లస్ నా నెత్తురు. పోయాడు వాడు.

ఇంకా ముగ్గురు పిల్లలు. నాకు వచ్చే పెన్షన్ అమ్మేసుకున్నాను. పెద్దపిల్లల పెళ్ళిళ్ళ కోసం, చచ్చినవాడి చదువుకోసం. ఇదిగో, ఇది అందొచ్చింది.

దీనికి పెళ్ళి చెయ్యగలిగి వుండేవాణ్ణా? ఏమో అప్పో సప్పో చేసో, ముష్టెత్తో, ఏ బెగ్గర్‌కో కట్టబెట్టగలిగే వాణ్ణేమో! కానీ, చెయ్యలేదు. ప్రయత్నం కూడా చెయ్యలేదు. ఏం చెయ్యను? రెక్కలు అలిసిపోయిన నాకూ, నా భార్యకీ, రెక్కలింకా రాని పసికుంకలకీ, ఇదిగో, ఇది ఏదో యింత పడేస్తోంది.

మరి, దాని వయస్సో..? కలలో? శరీరమో..? కోరికలో..? ఎక్కడో, ఏదో ఏడుస్తుంది లెమ్మనుకుని సరిపెట్టుకున్నాను. అసహ్యంగా చూడకండలాగ. అపహాస్యంగా నవ్వకండలాగా. అరవై ఐదేళ్ళ జీవితాన్ని తిన్నాను. అయినా, ఆకలి తీరలేదు. ఆకలి బాబూ ఆకలి. నా అన్నం నేనిక తెచ్చుకోలేనని తెలుసుకుని, నా ముసలితనం మీద, నా పిల్లల పసితనం మీద, రెట్టించిన బలంతో దూకుతోన్న ఆకలి. ఆకలి. ఆకలి..

పోనీ, ఎక్కడో, ఏదో గుట్టుగా ఏడ్వచ్చుగా? అంత వయసొచ్చింది, చదువు, ఉద్యోగం, జ్ఞానం అన్నీ వున్నది. కడుపో కాలో రాకుండా చూసుకోవద్దూ..? పోనీ, వచ్చిందయ్యా గుట్టుగా తీయించేసుకోవచ్చుగా? ఇలా, చావబోతున్న నన్ను, బతకబోతున్న పసివాళ్ళని రట్టుచేసి, ఇలాంటి వెధవ పనిచేసి పోతుందా రంకుముండ.

కడుపు నిండిన కళ్ళతో విస్మయాన్ని చూపకండి బాబూ? పేగులకి ఆకల్ని తినిపించి, పెదవులకి కన్నీటి దాహాన్ని తాపించి, కళ్ళకి బతుకు కళ్ళజోడుని తగిలించి ఆర్తి, అసహాయతలతో దడ దడలాడుతోన్న గుండె సవ్వడితో లెక్క ప్రారంభించండి. లెక్క సరిపోతుంది. కళ్ళు, విస్మయానికి బదులు విరక్తిని శేషిస్తాయి. "

"ఊఁ?... ఊఁ బాధ్యత పూర్తిగా ఆయనకి అంటగట్టగలమా!" ప్రశ్నించాడు మానవత్వం ఎడిటర్.

"అది మానవత్వం ఎడిటర్ 'మనిషిగా మీ బాధ్యత నాకు సంబంధం లేదు"

"ఇట్సాల్‌రైట్.. ఈసారి ఎక్కడికి వెళతావు?"

"ముందుకు సాగిన చూపుడు వేళ్ళనీ, ముడుచుకుపోయిన చిటికిన వేళ్ళనీ ఇంటర్వ్యూ చేసొచ్చాను."

"... ఏదో ఒకటి చూపమని మమ్మల్ని సృష్టించేడండీ దేవుడు. మేమేం ఆ పిల్లని కొట్టలేదే?! తిట్టలేదే? ఇదేవిటిలాగా అని అడగనైనా లేదే?

తెలిసీ తెలియని, జలపాతంలాంటి వయస్సులో, మా కుర్ర సోదరులు కొన్ని ఉత్తినే, ఈల వేసేందుకు సహకరించాయి. ఊరికే సరదాగా లయబద్ధంగా ఉంటుందని. అంతే ఉత్తినే చూసామంతే. మేం చూస్తేనే చచ్చిపోవాలా? వుయార్ సారీ. మాతో ఆ పిల్ల వచ్చి చెప్పివుంటే, పొడుగ్గా చూడ్డం మానేసే వాళ్ళం. వెనకనుంచి, పొట్టిగా, భుజాల మీదుగా, మా సోదరులు బొటన వేళ్ళతో చూసే వాళ్ళం."

"..బాగుందండీ బాగుంది, చాలా బాగుంది. మాకు 'ముడుచుకు పోయిన' అని విశేషణం తగిలించడం ఏం న్యాయం చెప్పండి? మేమేం ముడుచుకు పోలేదు. ఎటొచ్చీ, మమ్మల్ని అందుకునేందుకు పోటీ వుంది. ఆ పోటీలో ఎంతమంది అమ్మాయిలో వాళ్ళల్లో ఈ పిల్లకూడా ఒకతె. అందంలో, చదువులో, కూడా తెచ్చే ఫార్చ్యూన్‌లో ఈ అమ్మాయికన్నా అన్ని విధాలా అర్హతలూ, సామర్ధ్యం వున్న వాళ్ళు మమ్మల్ని అందుకున్నారు. తప్పు మాదా?

పోనీ, మేం మిమ్మల్ని, ఒకే ఒక్క చిన్న ప్రశ్న అడుగుతాం ఫ్రాంక్‌గా. ఆత్మవంచన చేసుకోకుండా జవాబు చెప్పండి? ఊరికే జాలితో, సానుభూతితో మీరు మీ చిటికిన వేళ్ళని ఎవరికైనా యిచ్చేస్తారా? చెప్పండి? జవాబు చెప్పండీ?"

"ఆఫ్ట్రాల్, పాళీగాణ్ణి నాకు చిటికెన వేలే లేదు. పోనీ, 'మనిషి'గా, మానవత్వం సంపాదకునిగా మీరు చెబుతారా జవాబు?"

"మైడియర్ పాళీ! డోంట్ కన్‌ఫ్యూజ్ మీ!"

"హలో సర్! నా పేరు పాళీ. మానవత్వం చీఫ్ రిపోర్టర్‌ని. మీ పేరు తెలీదు. ఆ అమ్మాయి తండ్రి మిమ్మల్ని దౌర్భాగ్యుడు అని రిఫర్ చేశారు. మీ అంతరంగంతో ఇంటర్వ్యూ కోసం వచ్చాను."

"..చూడండి పాళీగారూ! ఓ చిన్న మాట అడగనా? రెండు చేతులూ కలవందే చప్పట్లు వస్తాయంటారా?"

"ఆ అమ్మాయి, నేనూ పక్కపక్కనే పడ్జేస్తాం. అంతే! ఆవిడకీ నాకు కూడా ఒంట్లో వున్నది రక్తమే కదా! బ్లడ్ బిల్ట్ ఆఫ్ ఉప్పు అండ్ పులుపు. ఈజింటిట్? ఎవరికి లేదు చెప్పండి?"

"వనిత తనంతట తానై వలచి వస్తే మీరు పారిపోతారా? జస్ట్ వన్స్. నా రక్తం ఆవిణ్ణి పలకరించింది. ఆవిడ రక్తం బదులివ్వలేదనుకోండి, నా రక్తం మాట్లాడకుండా ఊరుకొనేదేమో కదా? ప్రొవొకేషన్ వజ్ ఆన్ టూ వేస్.."

"పోతే రక్తం, రక్తం మాట్లాడుకునేటప్పుడు, పెళ్ళి, కాపురం, సంసారం, పిల్లలూ వగైరా సిల్లీ, సిల్లీ అనింటరెస్టెడ్ టాపిక్స్ మాట్లాడుకుంటామా చెప్పండి ఆ సమయంలో, అలాంటి, బిట్టర్ సమ్మింగ్స్, ఫ్రాయిడూ, రాంషా, ఎట్సెట్రా మహామహులు అన్నారు కూడా గదా!"

"పైగా, నాకూ తల్లీ తండ్రీ, చెల్లెళ్ళూ, పరువూ ప్రతిష్టా, సోషల్ రెస్పాన్సిబిలిటీసూ, నెరవేర్చవలసిన వాగ్దానాలు ఇవేవీ లేవా మరి?"

"సరే, అలా మేం మాట్లాడుకుంటూ, ఆట్లాడుకుంటున్నప్పుడు, పొరపాట్న, ఏ దెబ్బ తగిలిందో ఏమో, ఆవిడ రక్తం, రాబోయే బిడ్డగా గడ్డ కట్టేసిందట. సరే, మొన్న అర్ధరాత్రిపూట వచ్చి, 'నీదే తప్పూ, ఒప్పేసుకో, నన్ను కట్టేసుకో, ఉరేసుకో' అని నిలదీసింది"

"నేనూ చాలా సున్నితంగానే చెప్పాను. చాలా చెప్పేసి, తేలిక పడిపోయాను. పైగా, 'ఇంత చీకట్లో ఒక్కదానివీ ఏం వెళతావూ, నేనొచ్చి దిగబెడతాన్లే' అన్నాను. ఆలోచిద్దాంలే' అని కూడా అన్నాను సుమండీ. అబ్బే, నా మాటేమైనా వింటేనా? నేనెంత మృదువుగా మాట్లాడేనో, తను అంత కఠినంగా తిట్టింది నన్ను. చివరికి, 'నువ్వేం తోడు రానక్కర్లేదూ, చీకటే నాకు తోడూ నీడా' వగైరా వగైరా ఏవేవో అనేసి వెళ్ళిపోయింది.."

"కాని.. కాని నిజంగా అయాం సారీ. ఆ అమ్మాయి ఇంత పన్జేస్తుందనుకోలేదు. డోంట్యూ థింక్ ఇట్స్ సిల్లీ? ఘనీభవించిన పిండాన్ని ద్రవీభవింపజెయ్యడం ఎంతసేపు చెప్పండి? పైగా, మీ పిలుపుకి బదులిచ్చిన ప్రతీ నెత్తుటి పొంగునీ, మీ జీవిత పాత్రలోకి నింపుకోగలరా?"

"...ఈ దౌర్భాగ్యుడు చెప్పిన చేతులూ - చప్పట్లూ. ఊఁ? మైడియర్ పాళీ! ఆ అమ్మాయికి పాతిక దాటుంటాయ్. న్యాయసూత్రం ఆవిణ్ణి, మేజర్‌గాను, విజ్ఞురాలిగానూ పరిగణిస్తోంది. వీడికి శిక్షపడదే? పైగా, ఎంత చెడ్డా, వీడుకూడా, కొంతలో కొంత జంటిల్మన్ లాగానే తోస్తున్నాడు. అతను ఒక్కడే బాధ్యుడని నువ్వు అనుకుంటున్నావా?"

"అదేం నాకు తెలీదని ముందే చెప్పాను. అన్నట్లు, చెప్పడం మరచిపోయాను. నేనిప్పుడు అర్జంటుగా ఒక కారు దగ్గరకు వెళ్ళాలి. ఇంటర్వ్యూ కోసం"

"కారా? ఏం కారు? ఈ కేసులో కారుకి సంబంధం ఏమిటి?"

"అదే తమాషా. నేను దౌర్భాగ్యుడితో ఇంటర్వ్యూ పూర్తిచేసేసరికి పొద్దుగూకిపోయింది. వచ్చేస్తూంటే, చీకటి చెప్పింది ఒక కారు గురించి, విచిత్రం ఏమిటంటే, ఈ కేసులో ఆ కారు కూడా ఉన్నట్లు ఆ అమ్మాయికీ, చీకటికీ, కారుకీ తప్ప మరెవ్వరికీ తెలీదట"

"డార్విన్ చెప్పిన ఇవల్యూషన్ థీరీ మీకు తెలుసుగదా! మీ రక్తంలో, సుప్తంగా, పశుత్వంగా ఉందట గదా?"

"ఆ రాత్రి నేను, నలుగుర్ని తీసుకొస్తున్నాను. అప్పటికి ఒకటి రెండు గంటల క్రితం ఆ నలుగురూ మనుషులే. అయితే వాళ్ళు, నన్ను, 'పారడైజ్'కి తీసుకు వెళ్ళమన్నారు. తీసుకువెళ్ళాను."

"ఆ 'భూతల స్వర్గం'లో వాళ్ళు, 'సురా'పానం చేశారు. ఈ 'భూసురా' పానం మనిషిని 'అసురు'నిగా చేస్తుందట. ఆ మందు, ముందు మనిషిని నిద్దరపోగొట్టి, వాడి నెత్తుర్లో నిద్దరోతున్న జంతువును తట్టి లేపుతుందట.

"సరే, 'భూతల స్వర్గం'లోకి నేను పంపిన్ అఆ నలుగురు మనుషులు, 'భూతాలై' తిరిగి వచ్చారు. తిరిగి వచ్చేస్తున్నాం. నేను, నా కళ్ళని బాగా తెరుచుకుని, తీక్షణంగా వెలిగించుకుని, ఆ నిద్దరోతున్న నలుగురు మనుషుల్నీ, మేలుకుని వున్న నాలుగు మృగాల్నీ తీసుకొస్తున్నాను.."

"..పులి, ఆకలేస్తే, లేడిని తిందా? కొత్తేవుంది? వింతేవుంది..?"

"చీకటి ఓ లేడిని తీసుకొస్తోంది. నన్ను చూసి, చీకటి భయపడి, ఆ లేడిని వదిలేసి పారిపోయింది. నేను, లేడి నా కాళ్ళ కింద ఎక్కడ పడిపోతుందో అని భయపడి, కీచుమని అరిచి ఆగిపోయాను. పులులు దిగాయి."

పులి చంపిన లేడినెత్తురు. నాలో ఆవేశం. పులి చంపిన లేడి నెత్తురు. స్పీడ్‌గా. అంతే.."

"నెత్తురోడుతోన్న ఆ లేడిని తీసుకువెళుతున్నానా, నాకా నెత్తురు, ఆ వాసన ఆ భుక్త శేషహరిణం.. అబ్బే, అంతా ఇబ్బందిగానూ, బరువుగాను, చిరాగ్గాను అనిపించింది. ఆ కాలువ దగ్గర కాస్సేపాగి, ఆ 'లఘుశంక'ని కాస్తా వదిలించేసుకున్నాను"

"ఆ పశువులెవరో నీకు తెలుసా?"

"ఆఁ తెలుసు కాని, సర్! ఆ కారు కోర్టుకొచ్చి సాక్ష్యం చెప్పదు. పైగా"

"నేను వెళ్ళేసరికి, ఆ నాలుగు మృగాలూ, రక్తంలోకి, ఎక్కడికో లోతుగా, యుగాల వెనక్కి అగాధాల్లోకి వెళ్ళిపోయాయి. మనుషులు నలుగురూ మేలుకుని ఉన్నారు. వాళ్ళ అంతరంగాల్తో కూడా మాట్లాడాను.."

"అయ్యయ్యో ఘోరం. ఘోరం సుమీ. ఘోరం బాబోయ్.. అవునూ, ఇంత ఘోరం జరుగుతున్నా, మాకు ఈ షణ్మాత్రమూ తెలియలేదే! అయ్యో అయ్యయ్యో!! ఏ మాత్రం తెలిసున్నా, ఇంత పచ్చి, దారుణమైన ఘోరాన్ని జరగనిస్తామా? అని వలవలా ఏడ్చేస్తారు నలుగురూ!"

"అవును పాపం, అప్పుడు మీరు నిద్దరోతున్నారూ, మీ గొంతు గొట్టంలోంచి భూసురా పానం చేసి, మీ నెత్తుటి మెట్టెక్కి, పాతాళంలోని పిశాచాలు, ఇలాతలం మీదికి విలాస పర్యటనకి వొచ్చాయి. అని చెప్పి, నేనే వాళ్ళని ఓదార్చవలసి వచ్చింది."

"పైగా, ఆ నలుగురు మనుషులూ చాలామంచి వాళ్ళుసార్. నిజంగా ఆ అమ్మాయి కుటుంబానికి, అజ్ఞాతంగా, నా ద్వారా 'మానవత్వం' తరపున, అయిదువేల రూపాయల ఆర్థిక సహాయం కూడా అందజేశారు"

"ఊఁ? అలాగా అయితే.. అయితే మరెలా? అబ్బబ్బబ్బబ్బా! ఈ రిపోర్ట్ పూర్తై చావడం లేదేమోయ్. ఆఁ అయిడియా యురేకా! చూడు, పాళీ మన ట్రాన్స్ మీటర్ ఆపరేట్ చెయ్యి?"

"ఎందుకు సర్?"

"ఎందుకేవిటోయ్! కంగారుపడకు. 'జీరో' వేవ్ లెంగ్త్ మీద ట్యూ చెయ్యి నేనామధ్య, ఫలానా యోగి దగ్గర తెలుసుకుని వచ్చి నీకు చెప్పాను చూడు. ఆ ఫ్రీక్వెన్స్ మీద మెస్సేజ్ పంపు"

"ఎవరికి సార్?"

"ఎవరికేఁవిటోయ్! విశ్వాంతరాళాన్ని కనెక్ట్ చేస్తుంది ఆ ఫ్రీక్వెన్సీ. ఆ అమ్మాయి ఆత్మకి కనెక్టవుతుంది. డైరెక్టగా ఆ అమ్మాయి అంతరాత్మని ఇంటర్వ్యూ చేసెయ్. కోడ్‌లో వస్తుంది ఆ అమ్మాయి ఇచ్చే స్టేట్‌మెంట్. ఆ అమ్మాయి కన్నా బెటర్ జడ్జి ఎవరు? అంతకన్నా, నిష్పాక్షికంగా, స్పష్టంగా, నిజాన్ని తెలియబరచగల సోర్స్ మరొకటి లేదు. ఆ అమ్మాయి రిపోర్ట్‌తో బాధ్యులెవరో తెలిసిపోతుంది. ఏఁవంటావ్?"

"బ్రిలియంట్ అయిడియా సర్. ఇదిగో పోతున్నా"

"సారీ సర్"

"ఏం?"

"ఏం ప్రయోజనం లేదు"

"ఎందుకని? ఫ్రీక్వెన్సీ దొరకలేదా?"

"దొరికింది."

"మరి?"

"మీరే చూడండి. ఆ అమ్మాయి ఆత్మ ఇచ్చిన స్టేట్‌మెంట్ డీ కోడ్ చేసి తెచ్చాను. కథ మళ్ళీ మొదటికే వచ్చింది."

"ఎవరు మీరు? ఎందుకు పిలిచారు నన్ను?"

"మానవత్వానికి మీ వల్ల కొంచెం సహాయం జరగాలి"

"ఏమిటది?"

"మీ కేసు విషయంలో మీ వాంగ్మూలం."

"అయ్యో! మీరే అలా అనేస్తే ఎలా? మీరు సరైన ఇన్ఫర్మేషన్ యిస్తేనే గాని, ఈ కేస్ సాల్వ్ కాదే? బాధ్యులెవరో పూర్తిగా తెలీదే"

"ఎప్పటికీ పూర్తిగా తెలీదు. ఎప్పటికీ సాల్వ్ కాదు"

"ఎందువల్ల?"

"నేనేమీ స్టేట్‌మెంటివ్వను గనుక"

"ఎందుకని?"

"మానవత్వంతో సంబంధం లేదిప్పుడు నాకు. నేనిప్పుడు మనిషిని కాదు. ఆ వలయం ఛేదించుకుని, విశ్వంతో ఐక్యత పొందిన ఆత్మస్వరూపాన్ని. మీ మానవత్వపు పరిధికి పరిమితమై వున్న ఏ అంశంతోనూ నాకు ఏ విధమైన సంబంధమూ లేదు. రాగం - ద్వేషం, మంచి - చెడు, ధర్మం - అధర్మం, సత్యం - అసత్యం, కక్ష - క్షమ, ఈ ద్వంద్వాల చక్రానికి లోబడి లేనిప్పుడు. మీకు సంబంధించిన అలాంటి ఏ ఒక్క అంశంలోనూ, నేను, నాదంటూ ఏ అభిప్రాయాన్ని చెప్పలేను. అవన్నీ పదాలు. సాపేక్షం పదాలు. 'నేను' సాపేక్ష పదార్థాన్ని కాను. స్వతంత్ర విశ్వరూపాన్ని"

"మరి, మరైతే, మా మానవత్వం చేస్తోన్న కృషికి మీ జవాబు?"

"'నేను' ప్రశ్నకీ, జవాబుకీ అభేదాన్ని మిమ్మల్ని మీరు ప్రశ్న వేసుకున్నారు. జవాబు కూడా మీ దగ్గరే దొరుకుతుందేమో వెతుక్కోండి. నన్నిక మీదట పలకరించకండి. కాకపోతే ఒక సలహా మాత్రం ఇవ్వగలను."

"తప్పకుండా యివ్వండి"

"మానవత్వం, తన కళ్ళనీ, చూపుడువేళ్ళనీ, చెవుల్నీ జిజ్ఞాసనీ, సకల జ్ఞానేంద్రియ కర్మేంద్రియాల్నీ, చైతన్యాన్ని, ఈ విధంగా విశాల విశ్వంలోకీ, అనంతాకాశంలోకీ, అగాధసాగరంలోకి, అజాండపు అవతలి అంచుకీ, అచింత్యపు అగమ్యంలోకి అన్వేషణకి తరిమే బదులు, తనకోసం తను, తనతో తనను, తనను తను, తనలోకే అన్వేషించుకుంటే?"

"??????????"

"మైడియర్ పాళీ?"

"సర్?"

"నిన్ను ఒకే ఒక్క ప్రశ్నకి సమాధానం పట్టుకు రమ్మని పంపించాను. సమాధానం ఎక్కడో జారవిడిచేసి, లక్ష ప్రశ్నలు పట్టుకు వచ్చావేమోయ్"

Post your comments